# పెళ్ళాలకు ప్రేమలేఖలు

భానుమతీ రామకృష్ణ


**మా చిరంజీవి యీ మధ్య కుటుంబంతోసహా అమెరికా నుంచి రావడం వలన ఇంట్లో వున్న ఇద్దరు వంటవాళ్లల్లో రెండవ వాడు నటేశన్ పోస్ట్ 'అప్‌గ్రేడ్' అయింది. మా అబ్బాయి తనతో కూడావుండేందుకు, బయట పన్లు చూసేందుకు వాడిని నియమించాడు!**

దాంతో ఒకే వంటవాడు కావడంవలన స్కూలుకెళ్లే మా అబ్బాయి పిల్లలకీ, ఇంట్లో అందరికీ వేళ వేళకి టిఫిన్లూ, భోజనాలూ రెడీ చేయడం కష్టంగాన్లూ వుంటుందని మా అబ్బాయి మరో వంటవాడిని కూడా చూడమని నటేశన్‌తో చెప్పాడు.

వున్న ఇద్దరు వంటవాళ్లలో ముత్తూ 'సీనియర్' వంటవాడు. ముత్తూ తన చేతికి సాయంగా వుంటాడని తెచ్చిపెట్టినవాడే నటేశన్! ముత్తూ వూరూ, నటేశన్ వూరూ ఒకటే:చెట్టినాడు.

ఇద్దరూ ఒకే వూరువాళ్లయినా వాళ్లిద్దరికీ ఎప్పుడూ పడేది కాదు. ఎప్పుడూ ఏదో కీచులాడుకొంటూనే వుండేవాళ్లు!

కారణం వయసులోనూ, వంటలోనూ 'సీనియారిటీ' కోసం ప్రాకులాడేవాడు ముత్తూ. ముత్తూ మంచివాడు. కాస్త ముక్కోపి అయినా దైవభక్తి గలవాడు. కాని అతనిలోవున్న పెద్ద లోపం చదువురాదు. ఒక్క అక్షరం ముక్క వ్రాయనూలేదు, చదవనూలేదు! పెళ్లాం దగ్గర్నుంచి ఉత్తరం వస్తే మా వాచ్‌మేన్‌చే చదివించుకొనేవాడు ముత్తూ! యీ విషయంలో ముత్తూ అందరికీ లోకువైపోయాడు పాపం! డ్రైవర్ దగ్గర్నుంచి నటేశన్ దాకా ముత్తూని చదువురాని దద్దమ్మ కింద కట్టి ఎప్పుడూ అతన్ని ఎగతాళిచేసి ఏడిపిస్తుండేవాళ్ళు!



అంతేగాదు ముత్తూ చేసిన వంట చిన్నయ్యగారికి (మా అబ్బాయి) నచ్చదనీ, తాను చేస్తేనే చిన్నయ్యగారు భోంచేస్తారనీ, ముత్తూకి సాంబారు తప్ప మరే కొత్త వంటలు చేయడం రాదనీ, నటేశన్ గొప్పలు చెప్పకోవడం ముత్తూకి మరికాస్త ఒళ్లు మంటగానూ, బాధగానూ వుండేది. ఎక్కడో హోటల్లో 'బాయ్'గా పనిచేస్తున్న నటేశన్‌ని తన వూరు వాడు అని మమ్మల్ని బతిమాలి తనకి సహాయంగా తెచ్చిపెట్టాడు. ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్న సామెతగా నటేశన్ ముత్తూ పాలిటికి ఏకు మేకై కూర్చున్నాడు. దానికి తోడు గోరు చుట్టుమీద రోకటి పోటన్నట్టు, ఒకరోజు నటేశన్ ఒక నల్లటి లావాటి గున్న ఏనుగులాంటి కొత్త వంటవాడిని వాళ్లూరువాడినే తీసుకొచ్చి పెట్టాడు మా యింట్లో. కారణం నటేశన్ 'సూపర్‌వైజర్' కావడం, బయట పనులు చూసుకోవడం, మా అబ్బాయితో కూడా వుండాల్సి రావడం.

దానికితోడు వేళకి స్కూలుకెళ్లే పిల్లలకి టిఫిన్లూ, భోజనాలూ తయారుచేసి [illegible]దకి తీసుకురావడానికి ముత్తూ ముసలివాడై పోతున్నాడు, అతనివల్ల కాదని మా అబ్బాయే నటేశన్‌తో మరో వంటవాడిని ముత్తూకి సాయంగా పెట్టమన్నాట్ట! అది విన్న ముత్తూ మహా అప్‌సెట్ అయిపోయాడు. ముత్తూని ఎన్ని తిట్టినా భరిస్తాడు గాని, తన్ను ఒక ముసలాడు అంటే భరించలేడు! నాలిక పీక్కు చస్తాడు. 'చూడండమ్మా! చిన్నయ్యగారు నేను ముసలివాడినై పోతున్నానన్నారట! నలభై అయిదేళ్లకే ముసలితనం ఏంటమ్మా!' అంటూ యాభై ఎనిమిదేళ్ల ముత్తూ వయసు దాచుకుని వాపోతుంటే నాకు నవ్వొచ్చింది!

అసలు ముత్తూకి ముసలితనం అన్నా, ముసలివాళ్లన్నా గిట్టదు. మా

పనిమనిషి అమ్మ ముసల్ది. అది పనికి వస్తే ముత్తూ చిరాకుతో ముఖం ముటముటలాడించుకొంటూ పని సరిగా చేయలేదని దాన్ని తిట్టిపోస్తూ దానికి కాఫీనీళ్లు గూడా యిచ్చేవాడు గాదు! ఒకోరోజు అది రాకుండా దాని మనుమరాళ్లు మల్లిక, మాణిక్యం పనికొస్తే ఆరోజు ముత్తూకి బ్రహ్మానందం. యీ లోకంలో వుండేవాడు గాదు. గోపికల మధ్య కృష్ణుడిలాగా, వాళ్లిద్దరి మధ్యా సరదాగా తిరుగుతూ నవ్వులతో పేల్తూ, వాళ్లిద్దరికీ టిఫిన్లూ, కాఫీలూ యిచ్చి, వాళ్లని కూర్చోపెట్టి వాళ్ల పని అంతా ముత్తూ చేసేవాడు.

టి.వి.లో గూడా పాత పిక్చర్లొస్తే ముత్తూ చూసేవాడు కాదు.

"ఏంటా పాత పిక్చర్లు చూసేది! అంతా ముసలివాళ్లు! పైగా కలర్ పిక్చర్లు కావు" అని పర్మిషన్ తీసుకుని బయట కొత్త సినిమా చూట్టాని కెళ్లేవాడు ముత్తూ! అదే టి.వి.లో యీకాలం కుర్రకారు శ్రీదేవి, రాధా, అంబిక వున్న కలర్ పిక్చర్లు వస్తే పెందరాడే పన్లు ముగించుకుని, కంటి జోడు వేసుకుని టి.వి. ముందు కూర్చునేవాడు.


ఒకసారి కంటి జోడు మర్చిపోయి టి.వి. చూస్తున్న ముత్తూని నటేశన్ ఏడిపించడానికి "ఆ పాడేదెవరయ్యా" అన్నాడు. రాధా, అంబికా అన్నాడు శ్రీదేవినీ, జయప్రదనీ చూసి. నటేశన్ గోలగా నవ్వుతూ "కంటి




ముత్తూ కదుపుకు తినకపోయినా మంచి ఖరీదైన సోపులూ, పౌడర్లూ, సెంట్లూ కొనిపెట్టుకొనేవాడు జీతం రాగానే. ఎవరైనా ముత్తూకి మంచి బహుమతి యివ్వగలిగితే సెంటు బాటిల్ ఒక్కటే. అందుకే నటేశన్ ముత్తూని 'సెంట్ బాటిల్' అనే పిలుస్తాడు. మల్లిక, మాణిక్యం పనికొచ్చిన రోజు మరికాస్త ఎక్కువ సెంటు పూసుకుని, వాళ్లకి కాస్త బుగ్గన పూసి, ఎవరూ చూడకుండా వాళ్లకి చెరో సోపు ప్రజెంట్ చేసి, ముసల్దాన్ని పనికి రావద్దనీ, వాళ్లనే పనికి రమ్మనీ వాళ్లని 'కాకా' పట్టేవాడు.

జోడు వేసుకోవయ్యా ముసలాయనా" అంటూ నటేశన్ ముత్తూని ఎగతాళి చేశాడు. ముత్తూని ముసలివాడన్నప్పుడల్లా విలవిల లాడిపోయేవాడు. ముత్తూ వీక్ పాయింటు తెలుసుకున్న కొత్త వంటవాడు కామాక్షి గూడా ముత్తూని "ఓ పెద్దాయనా" అంటూ పిల్చేవాడు. దాంతో ముత్తూ రెచ్చిపోయి "నేను నీకు పెద్దాయనలాగా కనిపిస్తున్నానా గున్న ఏనుగా!" అంటూ దెబ్బలాటకి దిగేవాడు.

ముత్తూకే చదువు రానుకొంటే కొత్తగా వచ్చిన వంటవాడు




కామాక్షికీ పొట్ట పొడిచినా ఒక్క అక్షరం ముక్క రాదు.

కామాక్షి పెళ్లాం వుత్తరం వ్రాస్తే కామాక్షీ గూడా వాచ్‌మన్ దగ్గరికే పరుగెత్తేవాడు చదివించుకోడానికి.

ఒకసారి కామాక్షి పెళ్లామూ, ముత్తూ పెళ్లామూ ఇద్దరూ ఒకేసారి వ్రాసినట్లున్నారు. రెండూ పోస్ట్‌మేన్ తెచ్చి యిచ్చాడు యిద్దరికీ. పొయి మీద పోపు వేస్తున్న ముత్తూ, కామాక్షికి వదిలిపెట్టి వాచ్‌మన్ దగ్గరికి పెళ్లాం లెటరు తీసుకుని పరుగెత్తాడు. కామాక్షీ లెటరు తీసుకుని వాచ్‌మన్ దగ్గరికి పరుగెత్తాడు. వాచ్‌మేన్ ఇద్దర్నీ చూసి పరిస్థితి అర్థం చేసుకుని తలనొప్పిగా వుంది, కాఫీ తాగి వచ్చి చదివిపెడతానన్నాడు. అమ్మమ్మా! కాఫీ నువ్వు బయటికెళ్లి తాగడమా! చిటికెలో నే కాఫీ కాచి తెస్తానుండు అంటూ ముత్తూ వంటింట్లోకి పరుగెత్తాడు. దీనంగా చేతితో పెళ్లాం లెటరు పట్టుకొని తన ముందు నిలబడ్డ కొత్త వంటవాడు కామాక్షిని వాచ్‌మేన్ మరికాస్త బిగువు చేసుకొంటూ 'ప్రొద్దుట్నుంచి టిఫిన్ తినలేదు. కాఫీ తాగి ముత్తూ భార్య లెటరు చదివి అట్లా వెళ్లి టిఫిన్ తిని వచ్చి నీ పెళ్లాం లెటరు చదివిపెడతాలే'' అన్నాడు అలక్ష్యంగా. అది విన్న కామాక్షి అదిరిపడి—

''అమ్మమ్మా! నువ్వు టిఫిన్ బయట హోటల్లో తిని రావడమా? చిటికెలో నీకు నాకోసం పెట్టుకొన్న టిఫిన్ తీసుకొచ్చి యిస్తా వుండన్నా!'' అంటూ కామాక్షి వంటింట్లోకి పరిగెత్తాడు. ఒకవైపు కాఫీ, మరొక వైపు టిఫినూ పట్టుకుని సేవకుల్లాగా నిలబడ్డ ముత్తూనీ, కామాక్షినీ వాచ్‌మన్ అలక్ష్యంగా చూసి టిఫిన్ చల్లారిపోయింది అంటూ ప్లేట్లో వున్న ఇడ్లీ, దోశలు సుతారంగా, తాపీగా తిని; ముత్తూ చేతిలో వున్న కాఫీ చల్లారిపోయింది వేడి చేసుకురమ్మని పంపి కామాక్షి లెటరు ముందు తీసుకున్నాడు. చటుక్కున కామాక్షి పెళ్లాం ఫోటో కవర్లోంచి కింద బడ్డది. అది చూసి, వాచ్‌మన్ 'భలే అందగత్తే నీ పెళ్లాం' అని మెచ్చుకొన్నాడు కామాక్షి పెళ్లాన్ని. తర్వాత లెటరు చదివి ముగించేలోగా ముత్తూ కాఫీ వేడిచేసి తీసుకొచ్చాడు. కామాక్షి పెళ్లాం లెటరు ముందు చదివినందుకు ముత్తూకి కోపం వచ్చి కామాక్షిని నానా తిట్లూ తిట్టాడు తన సీనియారిటీ దెబ్బతిన్నందుకు. వాచ్‌మేన్ కాఫీ తాగి ఒక తేపు త్రేన్చి ముత్తూ భార్య లెటరు తీసుకుని చదవబోతూ టక్కున ఆగిపోయాడు వాచ్‌మేన్. ఏం ఎందుకాగిపోయావ్! అని అడిగాడు ముత్తూ ఆతృతగా. 'ఏం లేదు మధ్యాన్నం భోజనం గురించి ఆలోచిస్తున్నాను. మా అన్నయ్య యింట్లో వుంటున్నాను. మా అన్నయ్యకు వేరే వూరు బదిలీ అయింది. నేనిక హోటల్లో తినాల్సిందే. నాకీ జీతం హోటల్లో తింటే చాలదు. భోజనం పెట్టి ఈ జీతం యిచ్చే మరో పనికి వెళ్దామా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు. వాచ్‌మన్ మాటలు విన్న ముత్తూకీ, కామాక్షికీ గుండెల్లో రాయి పడ్డది.

''అన్నా! నువ్వు ఎక్కడికీ వెళ్ళొద్దు! మా ఇద్దరి భోజనం సగం, సగం నీకు పెడతాం! నువ్వు ఏ హోటలుకూ పోవద్దు! నువ్వు మాకు చెయ్యాల్సిన సహాయం ఒక్కటే. మా పెళ్ళాలు రాసిన ఉత్తరాలు చదివి పెట్టడం, మేము మా పెళ్ళాలకి వ్రాయాల్సిన ఉత్తరాలు నువ్వు వ్రాసిపెట్టడం! అందుకు నీకేం కావాలన్నా ఇస్తాం! కాఫీ, టిఫినూ, భోజనం అన్నీ యజమానికి తెలీకుండా నీకు ఇస్తాం'' అంటూ వాచ్‌మేన్ కాళ్ళు పట్టుకున్నారు ముత్తూ, కామాక్షీ ఇద్దరూ. ఆ తర్వాతనే వాచ్‌మేన్ ముత్తూ పెళ్ళాం వ్రాసిన లెటరు చదివి వినిపించాడు ముత్తూకి. అందుకు ప్రతిఫలంగా పగలు వాచ్‌మేన్ సారథికీ, రాత్రి వాచ్‌మేన్ చిదంబరానికీ, ప్రొద్దుటే టిఫినూ, మధ్యాహ్నం దొడ్డివేపు దొంగ భోజనం, గంటకొకసారి స్పెషల్ టీ, రహస్యంగా రాత్రి భోజనం ఇత్యాది మాకు తెలీకుండా ముత్తూ, కామాక్షీ ఇద్దరూ సప్లయ్ చేస్తూండేవాళ్లు.

రాత్రి పదిన్నర దాటాక అందరి భోజనాలూ అయ్యాక ముత్తూ, కామాక్షీ ఇన్‌లాండ్ కవర్స్ తీసుకువెళ్ళి వాచ్‌మేన్ కాళ్ళు పట్టుకుని పెళ్ళాలకి ఉత్తరాలు వ్రాయించుకునేవాళ్లు. బయట వరండాలో వాళ్ళు వాచ్‌మేన్‌చేత ఉత్తరాలు వ్రాయించుకొనేప్పుడు మా పెంపుడు కుక్క 'బ్రూనో' ముద్దుగా వాళ్ళమీదపడి ఆడుకుంటూ వాళ్ళు పెళ్ళాలకి వ్రాయించుకునే ఉత్తరాలు చటుక్కున నోట కరుచుకుని జాలీగా ఇంటి చుట్టూ పరుగెత్తేది.. ముత్తూ, కామాక్షీ లబలబలాడుతూ దానివెంట పడి, దాన్ని బ్రతిమాలి, ఆ లెటర్లు దాని నోట్లోంచి లాక్కోబోయేసరికి 'బ్రూనో' ఆ లెటర్లు కాళ్ళకింద వేసుకుని నోటితో చించి అవతల పారేసేది. అది చూసి కడుపు మండిన ముత్తూ 'బ్రూనో'ని చావగొట్టేవాడు. అది కుయ్యో, మొర్రో అంటూ గోలగోలగా అరిచేది. అది విని నేను ఖంగారుగా హాలు తలుపు తీసి బయట వరాండాలోకొచ్చి ఏమిట్రా అని అడిగే లోపలే వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నట్టు ముత్తూ మా కుక్క కాళ్ళు పట్టుకుని 'అరవకే అమ్మగారొచ్చేస్తారు' అంటూ

# First and Foremost

**CRYSTAL®**

**ELECTRONIC GAS LIGHTERS**

Spark off a new idea in your kitchen-Crystal!
The gas lighter that is the most modern and popular. Sophisticated R & D has produced this kitchen marvel. Made out of imported components and available in a wide range in stainless steel and unbreakable plastic.




While other gas lighters burn themselves out ...
...Crystal Lighters have a life-long spark that never dies out.

***No wonder Crystal is India's largest selling gas lighter for the last six years.***

**Crystal Marketing Services,**
32, Princess Street, Saraf Mansion, 3rd floor, Opp. Indrabhuvan Hotel, Bombay-400 002. Phone: 314018/294607.
Telex: 169332 EMCO IN


బ్రూనో కాళ్ళావేళ్ళా పడడం కనిపించింది. నన్ను చూసిన వాచ్‌మేన్ పరుగెత్తుకెళ్ళి గేట్లో బుద్ధిగా నిలబడ్డాడు. ఏంటి గొడవని కామాక్షి నడిగితే, కామాక్షి సిగ్గుపడుతూ ముత్తూ పెళ్ళానికి ఉత్తరం అంటూ నసిగాడు.

నాకు నవ్వొచ్చింది. వాచ్‌మేన్‌గాడు పెళ్ళికాని బ్రహ్మచారి. వాడు వీళ్ళ పెళ్ళాలకి ఏం వ్రాస్తాడో వీళ్ళకేం తెలుస్తుంది. లెటర్సు చించేసిందని ముత్తూ, కామాక్షీవాళ్ళు కొత్త కవర్లు కొనాల్సొచ్చినందుకు, ఒక రోజు వృధా అయినందుకు కోపంతో 'బ్రూనో'కు మర్నాడు అన్నం పెట్టకుండా మాడబెట్టారు! అది చూసి నటేశన్‌కి ఒళ్ళు మండిపోయింది. బ్రూనో అంటే నటేశన్‌కి ప్రాణం. అంతేకాకుండా ముత్తూ, కామాక్షీ వాళ్ళ పెళ్ళాలకి ప్రేమలేఖలు వ్రాసే ఇద్దరు వాచ్‌మేన్లనీ ముప్పూటా దొంగతనంగా అన్నం సప్లయ్‌చేసి మేపడం మరి కాస్త అగ్గిమీద గుగ్గిలంలా తయారయింది. నెలంతా రావాల్సిన బియ్యం, పప్పూ, కాఫీపొడి, చక్కెర పదిహేను రోజులకే అయిపోవడం, ఇంట్లో ఆవు ఇచ్చేపాలు చాలక బయట పాల ప్యాకెట్స్ కొనడం అంతా సూపర్‌వైజర్‌గా ఇంటి మేనేజ్‌మెంట్ అంతా చూస్తున్న నటేశన్‌కి చికాకు కలిగించింది.

ముత్తూ తనకు పని ఇప్పించిన గురుతుల్యుడు. అంతేకాక నటేశన్ తండ్రికి ముత్తూయొక్క తండ్రి చదువు చెప్పిన మాస్టారు. ఎటు చూసినా గురుస్థానం ఆక్రమించుకున్న ముత్తూకి ఒక్క అక్షరం ముక్క రాకపోవడం వాడి ప్రారబ్ధం అనే చెప్పాలి. చిన్నప్పుడే ముత్తూని పోలేరమ్మ గుడిలో పూజారిగా వేసినందువల్ల ముత్తూకి చదువూ సంధ్యా రాకపోవడానికి కారణం అయింది. ముత్తూ తాతల కాలంనుండి ఆ గుడికి వాళ్ళింట్లో ఎవడో ఒకడు పూజారిగా వుండాలిట! ముత్తూ కొంత కాలం తర్వాత ఆ పని పెద్ద కొడుక్కొదిలిపెట్టి వంటపని కోసం పట్నం చేరాడట. ముత్తూని మందలించలేని నటేశన్ కామాక్షీని మందలించి వార్నింగ్ ఇచ్చాడు. వంటింటి వస్తువులు లెక్కగా వాడాలని. ముత్తూకి చదువు రాకపోయినా రోషం మహజాస్తి!

అందులోనూ తాను పనికి తెచ్చిపెట్టిన తనకిందివాడు తనమీద సవారీ చేయడమా! 'సర్లేవోయ్ పెద్ద సూపర్‌వైజర్‌వైనావు! ఫోన్లు తీసి చెప్పడం తప్ప ఏం పెద్దపని చేస్తున్నావ్ నువ్వూ? ఆ పని మాకూ తెలుసులే' అన్నాడు ఒళ్ళు మండి.

'అది నీవల్ల కాదులే' అన్నాడు నటేశన్ కోపాన్ని అణుచుకుంటూ.

'ఎందుక్కాదోయ్. అదేం బ్రెమ్మవిద్యా' అంటూ సవాల్ చేశాడు ముత్తూ నటేశన్‌మీద. అదే సమయంలో ఫోన్ బెల్ మోగింది.

'పోయి ఫోన్ తీసి నువ్వే మాట్లాడి చెప్పు. ఎవరు చేశారో' అంటూ నటేశన్ మేడమీదికి వెళ్ళిపోయాడు ముత్తూని ఏడిపించడానికి.

ముత్తూకి చదువు రానందువల్ల వచ్చిన మరో చిక్కేమిటంటే ఎవరైనా ఫోన్‌చేసి పేరు చెప్తే వాళ్ళ పేరు వాడి నోట్లో నానా భ్రష్టత్వం పట్టి రూపభేదం అయిపోయి చిన్నప్పుడు వాళ్ళ తల్లిదండ్రులు ముద్దుగా పెట్టుకున్న పేరు వాడు ఆ క్షణంలో ఖూనీ చేసిపారేసి గందరగోళం పేరు ఏదో చెప్తాడు మా దగ్గరకు వచ్చి. ఇలా చాలాసార్లు జరిగింది.

ఈసారి ఎవరి పేరు ఖూనీ చేయబోతాడోనని నేను చాటుగా వుండి 'వాచ్' చేస్తూ నిలబడ్డా! ఠీవిగా వెళ్ళి ఫోన్ ఎత్తి "అల్లో" అన్నాడు. అవతల వాళ్ళెవరో ఏం చెప్పారో తెలీదుగాని, వాడి ముఖం రంగులు మారింది. అది

దీపావళి శుభాకాంక్షలు



పండుగలకు, వివాహాది శుభకార్యాలకు
మీకు కావలసిన

- బనారస్, బెంగుళూరు,
- ధర్మవరం, కంచీపురం,
- ఆరణి, పోచంపల్లి,
- మైసూర్ క్రేప్ పట్టుచీరెలు

మరియు

- గద్వాల్, కోయంబత్తూర్,
- సేలం, వెంకటగిరి,
- పోచంపల్లి, మధురై ఇంకా-

అనేకరకాల
కాటన్ మరియు మిల్లువస్త్రాలకోసం
విచ్చేయండి..

వెంకటరమణ
బనారస్ సిల్క్ హౌస్
3-2-100, జనరల్ బజార్, సికింద్రాబాద్-3

* సరికొత్త స్టాకు వుంచుట మా ప్రత్యేకత *

చూసి వాడికి ఏమీ అర్థం కాలేదని గ్రహించగలిగా. 'ఎవరు మీరు' అన్నాడు. మళ్ళీ అవతల ఏదో చెప్పారులా వుంది. అటూ, ఇటూ చూశాడు- హెల్ప్ హెల్ప్ అన్నట్టు. ఎవరూ కనిపించలా. నేరుగా నా కోసం వస్తుంటే, నేనే ఏమీ ఎరగనట్టు 'ఏమిటి ముత్తూ' అన్నాను. వాడు చేవుడిమీద భారంవేసి అయోమయంగా నా మొహం చూస్తూ 'ఎవరో రింగిరిమాడం ఫోన్ చేస్తున్నాడమ్మా' అన్నాడు. రింగిరిమాడం! ఏం భాషో! అలాంటి పేరు ఏ మనిషైనా ఎందుకు పెట్టుకోవాలో నాకర్థం కాలేదు. నేనే వెళ్ళి అడుగుదామనుకుంటుండగానే నటేశన్ మేడమీది నుంచి కింది కొచ్చాడు.

'ఎవరో రింగిరిమాడం అనేవాడు ఫోన్‌లో వున్నాట్ట చూడు' అన్నాను. వాడు ఫోన్ తీస్తూనే అవతలి మనిషి చెప్పింది విని వాడు పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుతూ 'రింగిరిమాడం కాదమ్మా! శృంగేరి మఠం నుంచి మీకు ఫోన్ వచ్చింది. గురువులు రేపు వస్తున్నారట. మీకు చెప్పమని అక్కడి మేనేజర్ ఫోన్ చేస్తున్నాడు" అని నటేశన్ చెప్తూంటే ముత్తూ బుంగమూతి పెట్టి, 'అవును నాకు చదువు రాదుగదా! పేర్లుకూడా సరిగా చెప్పలేని సన్నాసిని' అంటూ ఉడుక్కుంటూ లోపలి కెళ్ళిపోయాడు.

ఇలాగే ఇంకోసారి పల్లావరం నుంచి మా బంధువులమ్మాయి సరోజ ఫోన్ చేస్తే ముత్తూనే ఫోన్ తీసి దాని పేరు ఆ గతే చేశాడు. 'అమ్మా ఎవరో రోజా అంటమ్మా పాజావరం నుంచి ఫోన్ చేస్తోంది' అని చెప్పాడు. ఇలాగే ఎందరి పేర్లో ఖూనీ చేస్తూ, మాకొచ్చే ఫోన్ నెంబర్లన్నీ తప్పుతప్పుగా చెప్పి మేము అవన్నీ తిప్పి తిప్పి మా ఫోన్ బిల్లు ఎక్కువ చేయడమే కాకుండా ఫోన్‌లో అవతలవాళ్ళచేత చివాట్లు తినేవాళ్ళం రాంగ్ నంబర్స్ తిప్పినందుకు! కామాక్షి సరేసరి. ఫోన్ వచ్చి పొరపాట్న ఆ సమయంలో ఎవరూ లేక కామాక్షే ఫోన్ ఎత్తితే వాడు మరీ అయోమయం! దానికి తోడు ఫోన్ విషయంలో ముత్తూకి జరిగే శృంగభంగం కళ్ళారా చూస్తుంటాడు గనక ఎందుకొచ్చిన గొడవని కామాక్షి ఫోన్ తీసిన వెంటనే రాంగ్ నంబర్ అని పెట్టేసేవాడు.

ఓసారి మా వారి స్నేహితుడి భార్య పోతే అయిదు రోజుల తర్వాత వాళ్ళింటి నుంచి మనిషి వచ్చి కార్డు యిచ్చిందాకా మాకు తెలీదు! మా కెందుకు .వెంటనే తెలియ జేయలేదని అడిగితే "ఫోన్ చేశామమ్మా నాలుగయిదు సార్లు చేశాం. ప్రతిసారీ రాంగ్ నంబర్ అని పెట్టేశాడు ఎవరో కామాక్షి అనే ఆయన, అని వచ్చినతను చెప్తుంటే కామాక్షి కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ "క్షమించడమ్మా నాకు సగం అర్థమై సగం కాలేదు. ఒకటి కొకటి చెప్తే ముత్తూని ఎగతాళి చేసినట్టు చేస్తారని నేను చెప్పలా తప్పే! అంటూ కళ్ళు తుడుచుకున్నాడు!

** ** **

ఒకరోజు వున్నట్లుండి కామాక్షి వాచ్‌మేన్‌ని పట్టుకుని చావబాదడం మొదలెట్టాడు. ఏమిట్రా అని విచారిస్తే వాచ్‌మేన్ చేత కామాక్షి పెళ్ళానికి వుత్తరం వ్రాయించేప్పుడు అంతకు ముందే కామాక్షి పెళ్ళాం ఫోటో చూసిన వాచ్‌మేన్ కామాక్షి పెళ్ళాం అందాన్ని వర్ణిస్తూ సొంతంగా కామాక్షి పెళ్ళానికి ప్రేమలేఖ లాంటిది వ్రాశాట్ట వాచ్‌మేన్! ఈ ఎద్దు ముద్దు స్వరూపం కామాక్షిగాడు నీకు తగిన భర్త కాదు. నీవు రంభలా వున్నావు ఒకసారి నువ్వు యిక్కడికి వస్తే నిన్ను చూడాలని వుంది అని ఏవిత్వ ధోరణిలో వ్రాశాట్ట కామాక్షి పెళ్ళానికి ఆ వుత్తరం తీసుకుని

కామాక్షి పెళ్ళాం చెట్టినాడు నుంచి హాటా హాటీగా రావడం మా యింటి గేట్లో నిలబడి మొగుడు కామాక్షిని కేకేయడం కామాక్షికి వుత్తరం చదివి వినిపించడం, రెడ్ హేండెడ్‌గా పట్టుబడ్డ వాచ్‌మేన్‌ని పట్టుకుని కామాక్షి చావ బాదడం విషయం యింత దూరం వచ్చిం తర్వాత ఆ వాచ్‌మేన్‌ని తీసేయడం తప్ప గత్యంతరం లేని మేము వాచ్‌మేన్ అక్కౌంట్ సెటిల్ చేయడం అంతా ఒక గంట సేపట్లో జరిగి పోయింది. పగలు వాచ్‌మేన్‌తో బాటు రాత్రి వాచ్‌మేన్‌ని గూడా తీసేయాలని సూపర్ వైజర్ నటేశన్ మా అబ్బాయితో చెప్పాడు. ఇద్దరూ లెటర్స్ వ్రాసే వాళ్ళే గనుక ముఖ్యంగా దొంగ తిండికి అలవాటు పడ్డారు గనక ఆ యిద్దర్నీ తీసేసి ఆ స్థానాల్లో యిద్దరు గూర్కావాళ్ళని పెట్టడం. వాళ్ళు హిందీ తప్ప మరే భాషరాని వాళ్ళు కావడం ముత్తూ గుండెల్లో రాయి పడ్డది! ఎదురుగా వున్న యింట్లో పాలు పిండే మల్లిక కాళ్ళు పట్టుకున్నాడు మళ్ళా పెళ్ళానికి వుత్తరం వ్రాయమని.

వాచ్‌మెన్‌కి చెందే లాంఛనాలన్నీ మల్లికకు కూడా ముత్తూ యివ్వడం చూసిన నటేశన్‌కి ఒళ్ళు మండి ముత్తూ పెళ్ళానికి ఒక ఆకాశ రామన్న లెటరు వ్రాశాట్ట. ఎదురింటి పాల మనిషి మల్లిక ముత్తూని వల్లో వేసుకొన్నదని దానికి తోడు మల్లిక ముత్తూ పెళ్ళానికి వ్రాసే వుత్తరంలో ముత్తూ అచ్చం తన పారిపోయిన భర్తలాగే వుంటాడనీ, ముత్తూలాగే తన భర్తకి చదువు రాదనీ, ముత్తూదీ బట్టతలే, తన భర్తదీ భట్టతలే అనీ, ముత్తూలో తన భర్తని చూచుకొంటున్నాననీ. కొంత తన పైత్యం చేర్చి వ్రాసిందట.


ఆ లెటరూ, నటేశన్ వ్రాసిన ఆకాశ రామన్న లెటరూ రెండూ చదువుకున్న ముత్తూ పెళ్ళాం వెర్రి కోపంతో మర్నాడు తెల్లారుగట్లే రైలు దిగి తుఫాన్‌లాగా వచ్చి ఎదురింట్లో పాలు పిండుతున్న మల్లిక జుట్టు పట్టుకుంది. తానెందుకు వ్రాయాల్సి వచ్చిందా వుత్తరం అంటూ!

"ఏడిసినట్టే వుంది! నీ మొగిడికి చదువు రాదు నీకు వుత్తరం రాసి పెట్టమని నా కాళ్ళా వేళ్ళాపడితే రాశాను. తప్పేం రాశాను ముత్తూ అచ్చు మా ఆయనలాగే వుంటాడు ఆయన్దీ బట్టతలే, ముత్తూదీ బట్టతలే. ముత్తూలో మా ఆయన్ని చూసుకుంటున్నాని రాశాను. తప్పేముందీ యిందులో. ఆ మాత్రం అర్థం చేసుకోక్కర్లా సాటి ఆడదానివీ" అంటూ మండి పడ్డది మల్లిక.

ముత్తూ గజగజలాడుతూ ఆ గండం ఎలా గడుస్తుందా అని ఒణికి పోతూ ఎలాగో వాళ్ళిద్దర్నీ సమాధాన పర్చి తక్షణం ముత్తూ తన పెళ్ళాన్ని కామాక్షి పెళ్ళాంతో జతచేసి వూరికి పంపించేశాడు.

ఆ గలాటా చూసిన నేను యిక వూరుకుంటే లాభం లేదని ఈ విషయం మా అబ్బాయి దాకా పోవడం యిష్టం లేక వెంటనే ముత్తూనీ, కామాక్షినీ పిల్చి యిక మీద వాళ్ళ పెళ్ళాలికి ప్రేమ లేఖలు వూళ్ళో అడ్డమైన వాళ్ళ చేత వ్రాయించడం మానెయ్యమనీ, కావాలంటే మా అబ్బాయి పిల్లలకి చదువు చెప్పే ట్యూషన్ మాస్టారు చేత గుట్టుగా వ్రాయించుకోమనీ యిద్దరికీ బుద్ధి చెప్పాను. వారం రోజుల తర్వాత ఒకరోజు ప్రొద్దుటే స్నానానికి పోబోతున్న నా దగ్గరికి నా మనవరాలూ, మనవడూ హడావిడిగా వచ్చి "నానమ్మా! ట్యూషన్ మాస్టారు మాకు చదువు చెప్పడం లేదు" అని కంప్లయింట్ చేశారు.

"ఏం! ఎందుకని చెప్పడం లేదు" అని అడిగాను.




జన జీవన సాగర మథనంలో కనిపించని హాలహల మెంతో
క్షణమైనా ఆగని గ్రహగతిలో అనిపించని కోలాహల మెంతో

వెలయాలి సుఖాలను కొల్లగొనీ పులకించే రసిక శిఖామణులూ!
వెలకట్టారా ఆ కన్నులలో విలపించే గంగాజల మెంతో

ఈ మౌనం శవమని నిరసించే మతిమాలిన మాటలకేం గానీ
మరణం కబళించే ఊపిరిలో పొరలాడే ఝంఝానిల మెంతో

తానున్నది మూల్గేగది అయినా తనకున్నవి ముసిరే రొదలైనా
పరమాత్ముడు ఎదురై శాసిస్తే ప్రశ్నించే మేధాబల మెంతో

ప్రతి తోట వసంతం విడిదైనా ప్రతిచోట ప్రమోదం కొలువైనా
తెగి రాలిన ఆశల మోసుల్లో తీండ్రించే దావానల మెంతో

ఏ మనసు పొరల్లో ఏముందో ఏనాడూ 'సినారె'కు తెలుసునులే
పడగెత్తే వంచన పైబడితే తొడగొట్టే బాధాగళ మెంతో

—డాక్టర్ సి.నారాయణరెడ్డి

"ముత్తూ, కామాక్షీ మాస్టార్ని వదలకుండా మార్చి మార్చి వుత్తరాలు వ్రాయించుకొంటున్నారు. వాళ్ళిద్దరికీ వుత్తరాలు వ్రాసి పెట్టేందుకే మాస్టారుకు టైము సరిపోతోంది. మాకు స్కూలుకు టైమయింది నానమ్మ.

'బై! బై' అని చెప్పి యిద్దరు పిల్లలూ స్కూలు కెళ్ళిపోయారు కార్లో ఎక్కి.

నాకు ముత్తూ మీదా, కామాక్షి మీదా ఎక్కడిలేని కోపం వచ్చింది. బలవంతంగా కోపం అణుచుకుంటూ ముత్తూనీ, కామాక్షినీ కేకేశాను. పిల్లలకి ట్యూషన్ చెప్పే మాస్టారు చేత వాళ్ళ పెళ్ళాలకి ప్రేమ లేఖలు వ్రాయించడం తక్షణం మానెయ్యాల్సిందిగా ఆర్డర్ వేసేశాను. ఇకపైన వాళ్ళ పెళ్ళాలకి వుత్తరాలు వ్రాసే బాధ్యత స్వయంగా నేనే తీసుకున్నాను. అది విన్న ముత్తూ, కామాక్షీ గతుక్కుమన్నారు. అంతే మళ్ళీ వాళ్ళ పెళ్ళాలకు వుత్తరాలు వ్రాయడమో, వ్రాయించడమో, ఇంతవరకూ జరగలేదు! గప్‌చిప్ సాంబారు బుడ్డీ!